నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 4-4-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 203 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పోలీస్ ఆంక్షల మధ్య ముగిసిన సునీల్ అంత్యక్రియలు

భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు
అంత్యక్రియలకు పెద్ద ఎత్తున వచ్చిన విద్యార్థులు
కెసిఆర్‌కు వ్యతిరేకంగా నిరుద్యోగుల నినాదాలు

మహబూబాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ మృతి చెందిన కేయూ విద్యార్థి బోడ సునీల్ అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. గూడూరు మండలం రామ్‌సింగ్ తండాలో అంత్యక్రియలు నిర్వహించారు. భారీ సంఖ్యలో విద్యార్థి సంఘాల నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయకులు తెలంగాణ అమరుల గీతాలను ఆలపించారు. ప్రభుత్వం ఉద్యోగ నియామక ప్రకటనలు విడుదల చేయడం లేదనే మనస్థాపంతో ఐదుగురోజుల క్రితం పురుగుల మందు తాగిని సునీల్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. పోసలీ÷– ఆంక్షలు, ఒత్తిళ్ల మధ్య తమ సాంప్రదాయం ప్రకారం కుటుంబ సభ్యులు రాంసింగ్ తండాలో అంత్యక్రియలు నిర్వహించారు.

అంతిమయాత్రలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో సునీల్ నాయక్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. మరోవైపు సునీల్ అంత్యక్రియల టైంలో రాంసింగ్ తండాకు బయటి వ్యక్తులు ఎవరూ రాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం సునీల్ డెడ్ బాడీ తీవ్ర ఉద్రిక్తతల మధ్య హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ నుంచి మహబూబాబాద్ జిల్లా రాంసింగ్ తండాకు చేరవేశారు. అంబులెన్స్‌కు ముందు, వెనుక ఏడు పోలీస్ వాహనాలను భద్రత కోసం ఏర్పాటు చేశారు. కాగా.. అంబులెన్స్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పోలీసులు ఇష్టమొచ్చిన రూట్‌లో అంబులెన్స్‌ను తిప్పారు. హైదరాబాద్ నుంచి నకిరేకల్ మీదుగా మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ, కురవి, అక్కడి నుంచి మహబూబాబాద్, కేసముద్రం, నాగారం బైపాస్ రోడ్డు మీదుగా తండాకు డెడ్ బాడీని తరలించారు. మెయిన్ రోడ్డు వదిలి కేసముద్రం నుంచి ఊర్ల మీదుగా తండాకు మృతదేహాన్ని తరలించడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్ మృతదేహాన్ని చూసి.. ఆయన తల్లి గుండెలు బాదుకుంది. కొలువు కొడ్తానని.. శవమై వచ్చావా అంటూ ఆమె ఏడ్వటం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. కాగా.. సునీల్ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు శనివారం రాత్రి ఆందోళన చేశారు. ప్రభుత్వం నుంచి లక్ష నగదు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి చెప్పారు. కానీ, దీనికి కుటుంబ సభ్యులు, స్థానికులు అంగీకరించలేదు. చివరకు 5 లక్షల నగదు, డబుల్ బెడ్రూం ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని ఆర్డీవో కొమురయ్య హామీ ఇచ్చారు. దాంతో సునీల్ కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు అంగీకరించారు. అంత్యక్రియలకు బిజెపి తదితర పార్టీలతో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులతో ఎన్‌కౌంటర్..
ఐదుగురు జవాన్లు మృతి

రాయ్‌పూర్, ఏప్రిల్ 3: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య శనివారం కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మరణించగా మరో 14 మంది గాయపడినట్లు సమాచారం. బీజాపూర్ జిల్లాలోని టారెమ్ సమీప అటవీ ప్రాంతంలో శనివారం ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఛత్తీస్‌గఢ్ డీజీపీ డీఎం అవస్థీ తెలిపారు. మావోయిస్టుల ఉనికిని తెలుసుకున్న సీఆర్పీఎఫ్‌కు చెందిన ఎలైట్ కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) యూనిట్, జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)కు చెందిన భద్రతా సిబ్బంది సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు.

ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువైపులా కాల్పులు జరిగాయి. ఐదుగురు భద్రతా సిబ్బంది మరణించగా మరో పది మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే అదనపు భద్రతా దళాలను అక్కడికి తరలించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతున్నదని పేర్కొన్నారు.

తెలంగాణలో అభివృద్ధి టిఆర్ఎస్‌తోనే సాధ్యం

ప్రతి ఇంటికి కెసిఆర్ మేనమామ అయ్యారు
మోహినికుంటలో డబుల్ ఇళ్లను ప్రారంభోత్సవంలో కెటిఆర్

రాజన్నసిరిసిల్ల,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తెలంగాణలో సిఎం కెసిఆర్ ప్రతి ఇంటికి ఓ మేనమామలా మారి ఆదుకుంటున్నారని మంత్రి కెటిఆర్ అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుతో పాటు పెళ్లికి కళ్యాణలక్ష్మి కింద లక్షాపదహారు వేలు అందచేస్తున్నారని అన్నారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటలో పోత్గల్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం కేసీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఆ తర్వాత లబ్దిదారులు ఆ ఇండ్లలో గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి టీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమైందన్న స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటలో నూతనంగా నిర్మించిన 65 డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.

మోహినికుంటలో డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మరో 6,825 ఇండ్లు జిల్లాలో కట్టుకోబోతున్నామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మూడు చెరువుల నీళ్లు తాగించారు.

ఒక్క ఇందిరమ్మ ఇల్లు కోసం రూ. 75 వేలు వారు ఖర్చు చేస్తే.. టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో రూ. 5 లక్షలతో డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించి ఇస్తున్నామని స్పష్టం చేశారు. మోహినికుంట గ్రామానికి ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. కానీ తెలంగాణలో మాత్రం అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులగా ముందు కెళ్తున్నాయని చెప్పారు. 75 ఏండ్ల స్వాతంత్యంలో ఏ పార్టీ చేయని అభివృద్ధిని టీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. వేసవి కాలంలోనూ ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీరు ఇచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్రం అవార్డులు మాత్రమే ఇస్తుంది కానీ నిధులు ఇవ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇకపోతే మోహినికుంటలో పెట్రోల్ బంక్, డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభం ప్రగతికి మార్గం అని అన్నారు. అలాగే మద్దికుంటలో రైతువేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అక్కడ్నుంచి చీకోడు బయల్దేరి.. రైతువేదిక, గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం చేసారు. ముస్తాబాద్, ఆవునూరులో రైతు వేదికలను కేటీఆర్ ప్రారంభించారు. హరిదాసునగర్‌లో గ్రామ కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక, ప్లలెప్రకృతివనం ప్రారంభోత్సవం చేసిన తర్వాత ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డుకు ఎంపికైనందుకు పాలకవర్గానికి సన్మానం చేసారు.

రైతు వేదికలకు ఇంటర్నెట్ సౌకర్యం

వ్యవసాయ వర్సిటీతో వేదికల అనుసంధానం
మంత్రి కెటిఆర్ కీలక ప్రకటన

రాజన్నసిరిసిల్ల,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): రైతు వేదికలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అనుసంధానం చేస్తామని మంత్రి కెటిఆర్ ప్రకటించారు. శాస్త్రవేత్తల సూచనలు సలహాలు అందేలా చేస్తామని అన్నారు. రైతువేదికలు రైతులకు మార్గదర్శకాలుగా ఉండాలన్నదే సిఎం కెసిఆర్ ఆకాంక్ష అని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కెటిఆర్ రైతువేదికను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు.. కానీ తెలంగాణలో మాత్రం అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులగా ముందుకెళ్తున్నాయని చెప్పారు. 75 ఏండ్ల స్వాతంత్యంలో ఏ పార్టీ చేయని అభివృద్ధిని టీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. వేసవి కాలంలోనూ ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీరు ఇచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్రం అవార్డులు మాత్రమే ఇస్తుంది కానీ నిధులు ఇవ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అవార్డులు ఇస్తోంది కానీ రాష్ట్రానికి మాత్రం నిధులు ఇవ్వడం లేదని చెప్పారు. నీతి ఆయోగ్ చెప్పినా కేంద్రం నుంచి రాష్ట్రానికి పైసా రాలేదని మండిపడ్డారు. కేవలం తీసుకోవడమే బీజేపీ ప్రభుత్వ పాలసీ అని తెలిపారు. మాకు నిధులు ఇవ్వకున్నా పర్లేదు కానీ.. మా దగ్గరకు వచ్చి గొప్పలు చెప్పొద్దని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలకు మెదడు మోకాళ్లలో ఉందని మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటలో పోత్గల్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం కేసీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఆ తర్వాత లబ్దిదారులు ఆ ఇండ్లలో గృహప్రవేశం చేశారు.

టిఆర్ఎస్‌కు మద్దతుగా ఎన్నారైశాఖ ప్రచారం

నల్లగొండ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): నాగార్జున సాగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్‌కు మద్దతుగా టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ పెద్దవూర మండలవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నది. శనివారం టీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ నాయకుడు క్టటెబోయిన శివ.. నోముల భగత్‌ను కలిసి ప్రచార శైలిని వివరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ అధ్యక్షుడు గుర్రాల నాగరాజు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. టీఆర్ఎస్ గెలుపే తమ లక్ష్యమని చెప్పారు. పార్టీ తరపున ప్రచారం చేసే అవకాశం కల్పించిన ఎన్నారై సౌతాఫ్రికా అధ్యక్షుడు గుర్రాల నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

కరోనా విషయంలో ఎప్పుడూ అజాగ్రత్తగా లేం

తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు వైద్య సేవలు : ఈటెల
కొత్తగా 1,078 మందికి కరోనా సోకిందని ఆరోగ్యశాఖ ప్రకటన

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): గత ఏడాదిగా ప్రభుత్వం కరోనా విషయంలో ఎప్పుడు రిలాక్స్ కాలేదని ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. శనివారం ఈటల మాట్లాడుతూ.. కరోనా కేసులు తగ్గించేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపడుతోందని చెప్పారు. ఒకప్పుడు గాంధీ, ఉస్మానియాలో మాత్రమే ఉన్న.. కరోనా చికిత్స ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా ఉందని మంత్రి ఈటల స్పష్టం చేశారు. వ్యాక్సిన్ వల్ల కొంత వైరస్ తగ్గుతోందన్నారు. కరోనాను కట్టడి చేసేందుకు ఆరోగ్యశాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. వయస్సులో ఉన్న వారికి మాత్రమే ఇబ్బంది కలుగుతోందని.. పిల్లలు, యువకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వైరస్‌పై వదంతులు నమ్మొద్దని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

ఇదిలావుంటే తెలంగాణలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గడిచినఒక్కరోజులో తెలంగాణలో కొత్తగా 1,078మందికి కరోనా సోకిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు శనివారం మీడియాకు తెలిపారు. గడిచిన ఒక్కరోజులో కొత్తగా 331 మంది కరోనా నుంచి కోలుకున్నారని, కరోనాతో బాధపడుతూ ఆరుగురు చనిపోయారని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 3,10,819కి చేరిందని, ఇప్పటివరకు మొత్తం 3,02,207 మంది కరోనా నుంచి కోలుకున్నారని వారు చెప్పారు. ఇప్పటివరకు కరోనాతో 1,712 మంది చనిపోయారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 6,900 మంది కరోనాతో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నారని, ఇందులో 3,116 మంది హోం క్వారంటైన్ లో ఉండి చికిత్స చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. గడిచిన ఒక్కరోజులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్తగా 283 మంది కరోనా బారినపడినట్టు వారు తెలిపారు. స్వీయనియంత్రణతోనే కరోనా కట్టడి సాధ్యమని వారు స్పష్టం చేశారు. అత్యవసర పనులు ఉంటేనే రోడ్ల మీదకు రావాలని, అలా వచ్చినప్పుడు విధిగా సామాజిక దూరం పాటించడంతో పాటు మాస్కులు దరించాలని సూచించారు. ప్రభుత్వం విధించిన కరోనా నిబంధనలను కచ్చితంగా పాటించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సాగర్ ఉప ఎన్నికలో ముగిసిన ఉపసంహరణ

19మంది నామినేషన్లు ఉపసంహరణ
బరిలో నిలిచిన 41మంది అభ్యర్థులు

నాగార్జునసాగర్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ ఉప ఎన్నికల బరిలో 41 మంది నిలిచారు. ఈ ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన శనివారం పూర్తయింది. మొత్తం 77 నామినేషన్లు దాఖలు కాగా, వలు కార ణాలతో 17 మంది నామినేషన్లు తిరస్కరించారు. బీజేపీ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నివేదితారెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థి కుతుబుద్దిన్‌లు తిరస్కరణ జాబితాలో ఉన్నారు. 19 మంది అభ్యర్థులు నామినేషన్స్ ఉపసంహరించుకున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం లభించింది. ఉపఎన్నిక నిర్వహణ తీరుపై జిల్లా ఎన్నికల అధికారి పీజేపాటిల్, ఎస్పీ ఏవీ రంగనాథ్‌లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సాగర్‌లో మకాం వేసిన కేంద్ర ఎన్నికల పరిశీలకులు అణువణువు పరిశీలిస్తున్నారు. మద్యం, మనీ పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసారు. ఉప ఎన్నిక పరిశీలకుడిగా ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాహుల్‌సింగ్ 29వ తేదీన కరోనా నిర్ధారణ పరీక్ష చేయించుకోగా పాజిటివ్‌గా తేలింది. బుధవారం ప్రభుత్వ అతిథి గృహంలోనే చికిత్స తీసుకున్న ఆయనకు ఇతర ఆరోగ్య సమస్యలు ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు.

మిడ్‌వెస్ట్‌తో ఓయూ ఎలక్ట్రికల్ విభాగం అవగాహన

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): మిడ్‌వెస్ట్ ఎనర్జీతో ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సామాజిక అవసరాలను తీర్చడానికి, మల్టీడిసిప్లినరీ విద్య, పరిశోధనలను ప్రోత్సహించడం ఈ అవగాహన ఒప్పంద లక్ష్యం. మిడ్‌వెస్ట్ ఎనర్జీతో ఓయూ విద్యార్థులు, అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్ అందించడం. ఓయూ ఇంఛార్జీ వీసీ అరవింద్ కుమార్ సమక్షంలో ఓయూ రిజిస్ట్రార్ గోపాల్ రెడ్డి, మిడ్‌వెస్ట్ ఎనర్జీకి చెందిన సౌమ్య కుక్రేటి అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. కుమార్, మిడ్‌వెస్ట్ టెక్నికల్ ప్రాజెక్ట్ హెడ్ స్టాన్లీ చా÷–లగ÷న సంయుక్తంగా పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

కులరాజకీయాలు మంచివి కావు: ఈటెల తూటాలు

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కులరాజకీయాలు సమాజానికి మంచిది కాదని మంత్రి ఈటెల రాజేందర్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో మంత్రి ఈటల రాజేందర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కులాల ప్రాతిపదికన రాజకీయాలు జరిగే దుర్మార్గపు ఆలోచన ఇక్కడే ఉందన్నారు. మార్పు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇది ఆత్మగౌరవ సమస్య.. చైతన్యాన్ని చంపితే ఉన్మాదమే వస్తుందన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కింది కులాల మీద ఉందని వ్యాఖ్యానించారు. జానెడు భూమి కోసం ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వమే భూములను పేదలకు పంచుతుందని తెలిపారు. పట్టా భూముల సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు

కరోనాతో ఆస్పత్రిలో చేరిన ఫరూక్ అబ్దుల్లా

-ట్వీట్‌లో వెల్లడించిన ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఆసుపత్రిలో చేరినట్టు ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఫరూక్ అబ్దుల్లాకు మార్చి 30న జరిగిన వైద్య పరీక్షల్లో కరోనా పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్ని ఓ ట్వీట్‌లో తెలియజేసిన ఒమర్ అబ్దుల్లా, తాము కూడా హోం క్వారంటైన్‌లో ఉన్నట్టు చెప్పారు. తాజాగా, ఫరూక్ అబ్దుల్లా ఆసుపత్రిలో చేరినట్టు ఒమర్ ట్వీట్ చేశారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఆసుపత్రులో చేర్పాలని వైద్యులు సూచించడంతో శ్రీనగర్ ఆసుపత్రిలో ఆయనను చేర్పించినట్టు చెప్పారు. తన తండ్రి త్వరగా కోలుకోవాలని సందేశాలు, ప్రార్థనలు చేస్తున్న ప్రతి ఒక్కరికీ తమ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్టు ఆ ట్వీట్‌లో ఒమర్ పేర్కొన్నారు. కాగా, ఫరూక్ అబ్దుల్లా త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ సహా పలువురు అభిలషించారు. 83 ఏళ్ల ఫరూక్ మార్చి 2న కోవిడ్ వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోను కూడా ఆయన ట్వీట్ చేశారు.

వైకాపా అధ్యక్షుడు గట్టు రాజీనామా

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తెలంగాణ వైకాపా అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయనే స్వయంగా వెల్లడించారు. జాతీయ పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 2023 ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేస్తానని ఆయన అన్నారు. ÷ాష్ట్రం ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారన్నారని ఆయన ఆరోపించారు. ఓ గిరిజన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. యాదాద్రికి నిధులివ్వడం తప్ప తెరాస చేసిందేమీ లేదని, ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాను సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

కారులో ఇవిఎం తరలింపుపై విపక్షాల ఆందోళన

పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన నేతలు
బిజెపి అక్రమాలకు పాల్పడిందంటూ విమర్శలు

గువహాటి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): అస్సాంలో రెండో దశ పోలింగ్ ముగిసిన తర్వాత ఓ ఈవీఎంను ప్రైవేటు కారులో తరలించిన సంఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం గువహాటిలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఈసీ తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత సుస్మిత దేవ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అభ్యర్థులందరూ అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ప్రజలు మావైపే ఉన్నారని వారు భయపడుతున్నారు. క్రిష్ణేందు పాల్‌పై, ఈవీఎం తీసుకెళ్లిన ఆయన వాహనంపై ఈసీ ఏం చర్యలు తీసుకుందంటూ ప్రశ్నించారు. అస్సాం శాసన సభ రెండో దశ పోలింగ్ గురువారం జరిగింది. రటబరి నియోజకవర్గం, ఇందిరా ఎంవీ స్కూల్ పోలింగ్ అధికారులు పోలింగ్ పూర్తయిన తర్వాత ఓ ఈవీఎంను పత్తర్‌కండి బీజేపీ ఎమ్మెల్యే కృష్ణేందు పాల్ కారులో తీసుకెళ్తున్నట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారుల తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరపడంతోపాటు లాఠీ ఛార్జ్ చేసి, నిరసనకారులను చెదరగొట్టారు. ఈ ఈవీఎం భద్రంగా ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలావుండగా ఈవీఎంను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించేందుకు ఎన్నికల అధికారులు అంతకుముందు ఉపయోగించిన కారు చెడిపోవడంతో, ఆ మార్గంలో వెళ్తున్న ఓ కారును ఆపారని, ఆ కారు బీజేపీ నేతకు చెందినదని ఆ తర్వాత తెలిసిందని మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఈ విషయమై స్పందించిన ఎన్నికల కమిషన్.. బీజేపీ అభ్యర్థికి చెందిన కారులో ఈవీఎంను తరలించినట్లు ఆరోపణలు రావడంతో నలుగురు పోలింగ్ సిబ్బందిని సస్పెండ్ చేసింది.

అభివృద్ధి,సుస్థిర శాంతి మా లక్ష్యం

గత ప్రభుత్వాలు అసోం గుర్తింపును ధ్వంసం చేశాయి
ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ వెల్లడి
అస్వస్థతకు గురైన వ్యక్తికి వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం

గౌహతి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): అసోంలో శాంతి, అభివృద్ధి సుస్థిరంగా ఉండాలంటే బీజేపీ కూటమికి ఓటు వేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు అసోం గుర్తింపునే ధ్వంసం చేశాయని మండిఎడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ శనివారం అసోంలో పర్యటించారు. తమది 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' అని మోదీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని ప్రజల జీవితాలను, ముఖ్యంగా మహిళల జీవితాలు సౌకర్యవంతం కావడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అన్న నినాదంతో ఐదేళ్లు పనిచేశామని తెలిపారు. అసోం అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. తాము అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నామని, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. సమాజంలో ఓ వింత పోకడ నడుస్తోందని, కొన్ని విషయాలను వక్రీకరించి చూపిస్తున్నారని మండిపడ్డారు. సమాజంలో విపక్ష ప్రదర్శించడం, సమాజాన్ని విడదీయడం, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తే వారిని లౌకికవాదులు అని అంటున్నారని, అందరి కోసం పాటుపడితే వారిని మతతత్వ వాదులు అంటున్నారని మండిపడ్డారు. అటు లౌకికవాదం, ఇటు మతతత్వం రెండూ దేశానికి పెద్ద ప్రమాదమని మోదీ పేర్కొన్నారు. తమూల్ పూర్ నియోజకవర్గంలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ సన్నివేశం చోటుచేసుకుంది. బహిరంగ సభలో పాల్గొన్న ఓ బీజేపీ కార్యకర్త హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. 'డీహైడ్రేషన్' తో బాధపడ్డారు. దీన్ని గమనించిన మోదీ... ఆయనకు వైద్యం చేయాలంటూ పీఎంవో వైద్య బృందాన్ని కోరారు. 'నాతో ప

తమిళనాట మోడీ రాజకీయ విన్యాసం !

నేటినిజం
ఆదివారం 4-4-2021

దక్షిణాదిలో తమిళనాట ఎఐడిఎంకె కీలుబొమ్మ ప్రభుత్వం కొనసాగేందుకు..మళ్లీ అది అధికారంలోకి వచ్చేందుకు ప్రధాని మోడీ నానా కష్టాలు పడుతున్నారు. సామభేద దాన దండోపాయాలను వినియోగి స్తున్నారు. జయలలిత మరణం తరవాత శశికళను జైలుకు పంపి...తిరిగి వచ్చినా రాజకీయాల్లోకి రాకుండా అడ్డుచక్రం వేసిన మోడీ..ఇప్పుడు కాలికి బలపం కట్టుకుని ప్రచారం చేస్తున్నారు. డిఎంకె, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందన్న భయంతో నానా కష్టాలు పడుతున్నారు. ఎత్తులు వేస్తున్నారు. దక్షిణాదిలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆశలు గల్లంతయ్యాయి. అక్కడ బిజెపి రావడం ఇక అసాధ్యం. మోడీ పాలన చూసాక బిజెపి వద్దురా బాబూ అని ప్రజలు ఘోషిస్తున్నారు. లేని కంపను పెట్టుకోవడం తప్ప మరోటి కాదని ప్రజలకు త్వరగానే తెలిసి వచ్చింది. పాలనాపరంగా బిజెపితో ఉపయోగం లేదని ప్రజలు గ్రహించారు. అందుకే తమిళనాట కూడా ఎఐడిఎంకె పట్ల విముఖతతో ఉన్నారు. అయితే పళనిస్వామిని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న మోడీ అనేక కుతంత్రాలకు తెరలేపారు. తమిళనాడులో డిఎంకె అధ్యక్షుని అల్లుడు, ఇతర నేతల నివాసాలపై ఐటి దాడులు చేయించారు. కేంద్రంలోని బిజెపి, అధికార అన్నాడిఎంకెలు కలిసి ఈ దాడులకు ఒడిగడుతున్నాయని డిఎంకె నేతలు మండిపడుతున్నారు. గతవారం తిరువణ్ణామలై జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇవి.వేలు నివాసంపై ఐటి అధికారులు సోదాలు జరిపిన తరవాత... తాజాగా డిఎంకె అధినేత స్టాలిన్ అల్లుడు శబరీసన్ నివాసంపై ఐటి శాఖ శుక్రవారం దాడులు జరిపింది. ఆయన నివాసంతో పాటు, ఆయనకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో కూడా అధికారులు సోదాలు జరిపారు. శబరీసన్ డిఎంకెలో ప్రముఖ నేతగా ఉన్నారు. ఆయన స్నేహితులతో, శత్రువులతో చర్చలు జరపడానికి ముందుంటారు. అలాగే అన్నానగర్ అభ్యర్థి ఎంకె. మోహన్ కుమారుడు ఎంకె. కార్తిక్ మోహన్ నివాసంపై కూడా సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులను డిఎంకె ఖండించింది. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో .. రాజకీయ ఒత్తిడి మేరకే డిఎంకె అధినేత స్టాలిన్ కుమార్తె నివాసంపై ఐటి దాడులు జరిపించారు. ఇదొక ఎత్తు అయితే రాజకీయ లబ్ది కోసమే రజనీకాంత్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించారని అర్థం చేసుకోవచ్చు. ఓ వైపు దాడులు..మరోవైపు తాయిలాలతో తమిళనాట మోడీ రాజకీయ విన్యాసం చేస్తున్నారు. అక్కడ అధికారంలో అన్నాడెంకె ఉండాలి. ఉంటేనే తమకు కాలుమోపే సందు దురుకుతుందని మోడీకి తెలుసు. మోడీ చర్యలపై తమిళనాట తీవ్రంగానే చర్చ సాగుతోంది. ప్రచారంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ ప్రధాని మోడీపై ఎదురుదాడికి దిగారు. తనను షాట్‌రూట్‌లో వచ్చానని అన్నారని, అయితే ఎవరు షాట్ రూట్‌లో వచ్చింది.. తానా.. గుజరాత్ ముఖ్యమంత్రా అంటూ ఘాటుగా స్పందించారు. ప్రధాని మోడీ ఎంతమంది నేతలను పక్కకు నెట్టారో తనకు తెలుసునని, ఆ జాబితా తన వద్ద ఉందని అన్నారు. పార్టీ ప్రముఖ నేతలైన ఎల్‌కె. అద్వానీ, మురళీ మనోహర్ జోషి, యశ్వంత్ సిన్హా, సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ పేర్లను ప్రస్తావించారు. తాను ఎవరికీ భయపడనని, ఉధయనిధి స్టాలిన్, కలైగ్నార్ (ఎం. కరుణానిధి) మనువడినని అన్నారు. ఐటి దాడులపై స్టాలిన్ స్పందించారు. ఇటువంటి ఆటంకాలకు భయపడబోమని హెచ్చరించారు. మోడీకి ఒక్క విషయం తెలియజేయాలను కుంటున్నాం.. మేము ద్రవిడులం.. ఇటువంటి ఆటంకాలకు భయపడబోమని స్టాలిన్ ఘాటుగా స్పందించారు. ఇకపోతే భారతీయ చలన చిత్రరంగ అత్యున్నత పురస్కారమైన ఫాల్కే అవార్డు పొందడానికి రజనీకాంత్‌కు గల అర్హతల విషయంలో సందేహం లేదు. కానీ ప్రకటించిన సమయం గురించే అంతా ఆలోచిస్తున్నారు. తలైవా పార్టీ పెడితే లబ్దిపొందాలని చూసింది. బిజెపి కానీ ఆయన తన ఆరోగ్య కారణాలు చూపుతూ రాజకీయ పార్టీకి దూరంగా ఉన్నారు. నిజ జీవితంలో బస్సు కండక్టర్ స్థాయి నుంచి ఇంత గొప్ప నటుడుగా ఎదగడం కూడా ఆయనకు మరొక ప్రత్యేకతను తీసుకు వచ్చింది. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ఊపందుకొని కొద్ది రోజుల్లో పోలింగ్ జరుగనున్నదనగా ఈ అవార్డును ఆయనకు ప్రకటించడం ద్వారా రాజనీకాంత్‌కు ఉన్న ఇమేజ్‌కు దెబ్బతగిలింది.ఇంతటి నటుడినీ, కేంద్రపాలక పార్టీ తన స్వప్రయోజనలకు ఉపయోగించుకోడానికి ఈ అవార్డును వాడుకున్నదనే అభిప్రాయం ఏర్పడిపోయింది. ఎన్నికల వేళ ఆయనకు ఫాల్కే అవార్డును ప్రకటించడంతో ఆ విషయం ఇప్పుడు పూర్తిగా రూఢి అయిపోయింది. భారతీయ జనతా పార్టీ దేశమంతటా అన్ని రాష్ట్రాల్లోనూ తన జెండానే ఎగిరేయాలని ఉబలాటపడుతోంది. అందుకు వీలుగా అన్ని అస్త్రశస్త్రాలను ప్రయోగిస్తున్న సంగతి ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నది. భారతీయ జనతా పార్టీ తమిళనాడు పాలక పక్షం ఎఐఎడిఎంకెని తిరిగి అధికారంలోకి తేవడం ద్వారా ఆ రాష్ట్రంపై తన పట్టును గట్టి పరుచుకునే వ్యూహంలో భాగంగా బరిలో వేరే బలమైన శక్తులేవీ లేకుండా చేసుకున్నదని స్పష్టపడుతున్నది. ఓ వైపు ఐటి దాడులు, మరోవైపు చిన్నమ్మను రాజకీయాలు దూరం చేయడం, మరోవైపు రజనీకాంత్‌కు ఫాల్కే అవార్డు ప్రకటించడం అన్నీ కూడా రాజకీయ ఎత్తులు కాక మరోటి కాదు.అయితే ఈ విన్యాసాలు ఏ మేరకు పనిచేస్తాయన్నది చూడాలి. నిజానికి బిజెపి పగ్గాలు చేపట్టాక ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తారని అంతా భావించారు. తమిళనాట కూడా ఇలాంటి ఆలోచనలోనే ప్రజలు ఉన్నారు. కానీ మోడీ అధికారాన్ని గుప్పిట పెట్టుకుని పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను అప్పనంగా పంచి పెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీంతో మోడీ నిజస్వరూపం ప్రజలకు తేటతెల్లమయ్యింది. అందువల్ల మోడీ నేతృత్వంలోని బిజెపికి దక్షిణాదిలో పాగా వేయడం అంత ఈజీకాదు.

త్వరలోనే జగిత్యాల మామిడి మార్కెట్‌కు శ్రీకారం

-అందుబాటులోకి కొల్హాపూర్ మార్కెట్ : నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): సకల సౌకర్యాలతో త్వరలో కొల్హాపూర్ మామిడి మార్కెట్ అందుబాటులోకి తీసుకు వస్తామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి త్వరలో రైతులు, వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. జగిత్యాల మామిడి మార్కెట్‌కు త్వరలో శ్రీకారం చుడతామని కూడా మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన వాలంతరీ సంస్థ 10 ఎకరాల స్థలంలో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా తాండూరు రైతుబజార్‌ను ఇంటి గ్రేటెడ్ మార్కెట్‌గా మార్చాలని అధికారులను ఆదేశించారు.యాసంగి కొనుగోలు కేంద్రాల వద్ద కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా మౌళిక సదుపాయాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పంటల కొనుగోళ్లు, మార్కెట్ల అభివృద్ధిపై మంత్రుల నివాస సముదాయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన సూర్యాపేట జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి స్నాహాలుచేస్తున్నట్టు తెలిపారు. ల్గ÷తులు వారి వద్ద ఉన్న టార్పాలిన్‌లను కొనుగోలు కేంద్రాలకు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్ నుంచే కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

తైవాన్‌లో ఘోర రైలు ప్రమాదం

48మంది మృత్యువాత

హువాలియన్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తైవాన్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 48కి చేరుకున్నది. ఆ రైలులో సుమారు 500 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. 8 బోగీలతో వెళ్తున్న ఆ రైలు.. ఓ టన్నెల్ వద్ద వాహనాన్ని ఢీకొట్టింది. ట్రాక్‌పై నిర్మాణ వాహనం అడ్డు రావడంతో ఈ ప్రమాదం జరిగింది. టన్నెల్ మధ్యలో నుజ్జు అయిన బోగీల్లో ప్రయాణికులు చిక్కుకున్నారు. వారిని రెస్కూ సిబ్బంది రక్షించింది. రాజధాని తైపి నుంచి టైటుంగ్‌కు వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. రైలు కిక్కిరిసిపోవడంతో అనేక మంది ప్రయాణికులు నిలిచి ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు అధ్యక్షుడు త్సాయి ఇంగ్ వెన్ సంతాపం తెలిపారు. ఘటన పట్ల విచారణకు ఆదేశించారు. తైవాన్‌లో ప్రస్తుతం టాంబ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో అక్కడ రైలు ట్రాఫిక్ భారీ స్థాయిలో ఉంటుంది. పట్టాలు తప్పిన బోగీల నుంచి సుమారు వంద మంది ప్రయాణికులను రక్షించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దాకింగ్‌షుయి టన్నెల్ వద్ద రైలు ప్రమాదం

వివాహేతర సంబంధం కేసులో పోలీసుల విచారణ?

యాదాద్రి భువనగిరి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఓ వివాహిత వివాహేతర సంబంధాన్ని పెట్టుకొని ఇంట్లోనే ప్రియుడితో కలిసి ఉన్న విషయాన్ని గ్రహించిన యువతి భర్త వారిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అక్రమ సంబంధం పెట్టుకోగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న యువతి భర్త ఇరువురికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారని సమాచరం. కేసు విచారణలో ఉందని తెలిపారు పట్టణంలోని డాగ్ బంగ్లా ఏరియా లో నివాసం ఉంటున్న ఓ వివాహిత అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో భర్త అనుమానంతో మాటు వేసి దాడి చేశారు. భార్యకు సహకరించిన తల్లి, ప్రియుడిపై దాడి చేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు ఈ మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది. అయితే ఈ ఘటనపై గతంలో వచ్చిన వార్తలో సమాచారం పొరపాటుగా వచ్చింది. దీనిపై పోలీసులు వి జరిగాయని తెలిసింది.

భూమిని లాక్కున్నారంటూ వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి): వేములవాడలో అశోక్ అనే యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసనకు దిగాడు. తనకు ఉన్న ఎకరం 24 గుంటల భూమిని కాలువ కిందపోయిన భూముల్లో కలిపారని యువకుడు గుడిసె అశోక్ ఆవేదన వ్యక్తం చేశాడు. శాత్రజ్‌పల్లిలో కాలువ కింద తన భూమి కలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. మండలంలోని ఉన్న అధికారులకు చెప్పిన..తన బాధను ఎవరు పట్టించుకోకపోవడంతో వేములవాడలో వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు.. భూమిని తనకు ఇవ్వాలని లేదంటే ఇక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానంటున్నాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని కిందకు దింపడానికి ప్రయత్నాలు చేసారు.

సాగర్‌లో టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ ప్రచారం

నల్లగొండ, ఏప్రిల్ 3: నాగార్జున సాగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్‌కు మద్దతుగా టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ పెద్దవూర మండలవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నది.

శనివారం టీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ నాయకుడు కట్టెబోయిన శివ.. నోముల భగత్‌ను కలిసి ప్రచార శైలిని వివరించారు.

ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ అధ్యక్షుడు గుర్రాల నాగరాజు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీఆర్ఎస్ గెలుపే తమ లక్ష్యమని చెప్పారు. పార్టీ తరపున ప్రచారం చేసే అవకాశం కల్పించిన ఎన్నారై సౌతాఫ్రికా అధ్యక్షుడు గుర్రాల నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

మధ్య తరగతిని చిత్తు చేసిన కరోనా విశ్వ మహమ్మారి

('ప్యూ పరిశోధన కేంద్రం' తాజా నివేదిక ఆధారంగా)

కరోనా విశ్వ మహమ్మారి ప్రభంజనానికి ఇండియాలో మధ్య తరగతి వర్గాల సంఖ్య 32 మిలియన్ల వరకు తగ్గారని, 75 మిలియన్ల ప్రజలు దారిద్ర్య రేఖ దిగువకు నెట్టబడ్డారని 'ప్యూ పరిశోధన కేంద్రం' తాజాగా విడుదల చేసిన నివేదికలో ఆశ్చర్యకర అంశాలు బయట పడ్డాయి. మన దేశంలో 2011 నుంచి 2019 వరకు మధ్య తరగతి ప్రజలు క్రమంగా పెరగడం గమనించారు. కరోనా వైరస్ కల్లోలానికి ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు చితికి పోవడంతో 2020లో విశ్వవ్యాప్తంగా 54 మిలియన్ల మధ్య తరగతి ప్రజలు తగ్గిపోయి పేదలుగా మారరని, 8.7 శాతం నుంచి 10.4 శాతానికి పేదరికం పెరిగిందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనాకు పూర్వం 672 మిలియన్ల పేదలు ఉండగా, కోవిడ్-19 అనంతరం వారి సంఖ్య 803 మిలియన్లకు పెరగడం పరిశీలించారు. చైనాలో మధ్య తరగతి వర్గాలు 10 మిలియన్లు తగ్గడం మరియు పేదరికంలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనించారు. ప్రపంచ జనాభాలో 3వ వంతు జనాభా కలిగిన ఇండియా మరియు చైనా దేశాల మధ్య కరోనా ప్రభావంలో జీవన ప్రమాణాల్లో వేరు వేరుగా మార్పులు గుర్తించడం జరిగింది. 2020లో ప్రపంచవ్యాప్తంగా ఇండియాలోనే మధ్య తరగతి వర్గాలు అధికంగా కుచించుకు పోయారని మరియు పేదరికం ఎక్కువగా పెరిగిందనే వాస్తవాలు దేశవాసులను విస్మయానికి గురి చేస్తున్నాయి. కరోనా విజృంభనతో జనవరి-2021 అంచనాల ప్రకారం ఇండియాలో ఆర్థిక ప్రగతి 9.6 శాతం పడిపోవడం, చైనాలో 2 శాతం పెరగడం పరిశీలించారు.

ఇండియాలో 28 శాతం ప్రజలు మధ్య తరగతి జీవన ప్రమాణాలను కలిగి ఉన్నారని తెలుస్తున్నది. దేశ జనాభాను జీవన ప్రమాణాల ఆధారంగా ప్రజలను నిరుపేద, దిగువ (లోయర్) మధ్య తరగతి లేదా అల్పాదాయ, మధ్య తరగతి, ఉన్నత (హైయ్యర్) మధ్య తరగతి మరియు అతి సంపన్న వర్గాలుగా విభజించబడ్డారు. పేదలు ఒక్కొక్కరి దినసరి ఆదాయం 2 డాలర్ల కన్న తక్కువ, అల్పాదాయ వర్గాల ఆదాయం 2 - 10 డాలర్లు, ఎగువ మధ్య తరగతి 10 - 20 డాలర్లు, ఉన్నత మధ్య తరగతి 20 - 50 డాలర్లు మరియు అతి సంపన్న వర్గాలు 50 డాలర్ల కన్న అధికంగా దినసరి ఆదాయం కలిగి ఉన్నాయి. ఇండియాలో కరోనా మహమ్మారి కారణంగా ఉన్నత మధ్య తరగతి వర్గాలు ఒక మిలియన్, ఎగువ మధ్య తరగతి వర్గాలు 7 మిలియన్లు, మధ్య తరగతి వర్గాలు 32 మిలియన్లు, అల్పాదాయ వర్గాలు 35 మిలియన్లు తగ్గారని మరియు పేదలు 75 మిలియన్లు పెరిగారని నివేదిక స్పష్టం చేసింది.

కరోనాకు పూర్వం భారతదేశ మధ్య తరగతి వర్గాలు 99 మిలియన్లుగా అంచనా వేయగా, కోవిడ్-19 దెబ్బకు 3వ వంతు తగ్గిపోయి, వారి సంఖ్య 66 మిలియన్లకు పడిపోయిందని వివరించారు. ఇండియాలో కరోనాకు ముందు 59 మిలియన్ల నిరుపేదలు ఉండగా, 2020 చివరి నాటికి 134 మిలియన్లకు పెరగడం విచారకరంగా తోస్తున్నది. ఇండియాలో వైరస్ దుష్ప్రభావానికి పేదరికం రేటు 4.3 శాతం (జనవరి-2020) నుంచి 9.7 శాతం (మార్చి-2021) పెరిగిందని గమనించాలి. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం కరోనా కల్లోల ఫలితంగా 25 కోట్ల ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారని తెలిపింది. కోవిడ్-19 విసిరిన పంజా ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరగడం, మధ్య తరగతి కుటుంబాలు తగ్గడం దేశ సమగ్రాభివృద్ధిని కుంటుపడేలా చేసింది. వైరస్ వల్ల దక్షిణ ఆసియా దేశాల్లో మధ్య తరగతి అతిగా కుచించుకు పోవడం మరియు పేదరికం పెరగడం గమనించారు. కోవిడ్-19 విధించిన జీవనశైలిని పాటిస్తూ, టీకాలను సత్వరమే వేసుకొని కరోనా కోరలు పీకేసి, దేశ ఆర్థిక రథాన్ని పట్టాలపైకి చేర్చి, సకల కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచుకుంటూ పేదరికాన్ని తగ్గించే ప్రయత్నాలు చేద్దాం. ఆర్థిక అసమానతలు మరియు ఆకలి కేకలు లేని నవ భారతాన్ని నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రంగారెడ్డి,మేడ్చెల్ జిల్లాల సమగ్రాభివృద్ధి

వలసలు పెరగడంతో సమీకృత వసతుల కల్పన
సమస్యల పరిష్కారం కోసం సీఎస్ అధ్యక్షతన నోడల్ ఏజెన్సీ
ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం కెసిఆర్ నిర్ణయం

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరానికి అనుసంధానమై దినదినాభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమీకృతాభివృద్ధి, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సీఎస్ సోమేశ్ కుమార్ అధ్యక్షతన ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలలో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారం, భవిష్యత్తు అవసరాలను అంచనా వేస్తూ మౌలిక వసతుల సమగ్రాభివృద్ధి కోసం ఏకీకృత విధానాన్ని అమలుపరచడం అనే అంశం మీద శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బేతి సుభాష్ రెడ్డి, అరికెపూడి గాంధీ, కె.పి వివేకానంద, కాలె యాదయ్య, మాధవరం కృష్ణారావు, సీఎస్ సోమేశ్ కుమార్, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, ఇతర ముఖ్య పట్టణాల్లో సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణంతో పాటు, టౌన్ హాల్స్ నిర్మాణం, రోడ్లు, విద్యుత్తు, తాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక వసతులను అభివృద్ధి పరచడం, సీవరేజీ డ్రైనేజీ, నాలాల మరమ్మత్తు, వరదనీరు, మూంపు, ట్రాఫిక్ వంటి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. ఈ దిశగా అనుసరించాల్సిన కార్యాచరణ కోసం ఆ రెండు జిల్లాల స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, సంబంధితశాఖల అధికారులతో సమావేశం కావాలని ఆదేశించారు. హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా పురోగమిస్తున్నది. నగరంలో భాగంగా ఉన్న రంగారెడ్డి, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలు దిన దినాభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను సమగ్రంగా అభివృద్ధి పరుచుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. హైదరాబాద్ నగరంతో పాటు సమ్మిళితాభివృద్ధిని కొనసాగించే విధంగా విస్తృత పరిధిలో ఒక సమీకృత విధానాన్ని రూపొందించుకోవాలి. ఇందుకు నిరంతరం పర్యవేక్షించేందుకు సీఎస్ సోమేశ్ కుమార్ అధ్యక్షతన నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాలి. ఈ జిల్లాల్లో నివసిస్తున్న ప్రజలకు హైద్రాబాద్ నగరంలో మాదిరి విద్య, వైద్యం వంటి అన్నిరకాల సౌకర్యాలను మరింతగా అందుబాటులోకి తెవాలి. అందుకు ఏ నియోజకవర్గం పరిధిలో ఏ సమస్యలున్నాయో, వాటిని ఒక ప్రాజెక్టు రూపంలో స్థానిక ఎమ్మెల్యేలు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధికి ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. వాటి పరిష్కారానికి నోడల్ అధికారి అధ్యక్షతన తరచూ సమావేశమవ్వాలి. ఇందులో ఏఏ శాఖలు భాగస్వామ్యం కావాల్సి ఉన్నవి? ఎంత ఖర్చు అవుతుంది? తదితర అంశాన్నింటిని ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి చర్చించాలి. నెలకోసారి ప్రజాప్రతినిధులు సీఎస్ తో క్రమం తప్పకుండా సమావేశం కావాలి. ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు నోడల్ అధికారి సమీక్షించాలి. అందుకు సంబంధించిన నిధులను సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. అత్యద్భుతమైన వాతావరణ పరిస్థితులున్నాయి. మిషన్ భగీరథ తాగునీరు నిరంతరం అందుతున్నది. తాగునీటి అవసరాల కోసం అటు గోదావరి ఇటు కృష్ణా జలాలను నింపుకొనేందుకు అతిపెద్ద రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకుంటున్నం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇప్పటికే జనాదరణ పొందిన బస్తీ దవాఖానాలను ఈ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయాలి. ప్రజల ఆహార అవసరాలను గుర్తించి వారికి పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు వంటి ఆహారాన్ని అందుబాటులోకి తెస్తూ గృహిణులకు అందుబాటులో ఉండే విధంగా విశాలమైన స్థలాలను ఎంపిక చేసి, వెజ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేయాలన్నారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటులో ఉంచడం, పటిష్టంగా రోడ్ల నిర్మాణం, మురుగునీరు వంటి పారిశుధ్యాన్నితొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడం, వరదల నివారణ ముంపు సమస్యలను అధిగమించడం వంటి పనులతో పాటు, రెవిన్యూ, భూ రిజిష్ట్రేషన్ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలి. తద్వారా ఈ రెండు జిల్లాలు భవిష్యత్తులో హైదరాబాద్‌తో పోటీ పడుతూ అభివృద్ధి చెందుతాయి. శాటిలైట్ టౌన్ షిప్పుల నిర్మాణం ఊపందుకుని అత్యంత సుందరంగా రూపుదిద్దుకుని, భవిష్యత్తులో హైదరాబాద్ ముఖ చిత్రాన్నిమరింత గుణాత్మకంగా మార్చివేయడం ఖాయవ ఎన్నారు.ఇందులో భాగంగా షాద్ నగర్, పెద్ద అంబర్ పేట, ఇబ్రహీంపట్నం, జల్ పల్లి, శంషాబాద్, తుర్కయాంజల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, శంకర్ పల్లి, తుక్కుగూడ, ఆమన్ గల్ వంటి మున్సిపాలిటీలు, బడంగ్ పేట్, బండ్లగూడ జాగీర్, మీర్ పేట్, జి÷-లలెగూడ వంటి మున్సిపల్ కార్పొరేషన్లు మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్ నగర్, నిజాంపేట వంటి మున్సిపల్ కార్పొరేషన్లు.., మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్ కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్ వంటి మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్టు సీఎం తెలిపారు.

ఈ ప్రాంతాలన్నీ హైద్రాబాద్ నగరంలో దాదాపు కలిసిపోయాయని, వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి వెతుక్కుంటూ, ఉద్యోగాల నిమిత్తం వచ్చిన తెలంగాణ సహా ఇతర ప్రాంతాల ప్రజలు ఇక్కడ స్థిర పడుతున్న నేపథ్యంలో, భవిష్యత్తు తరాల అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచించాలన్నారు. ఇందుకు సంబంధించిన నిధులను సమీకరించడం, నోడల్ ఏజెన్సీ ఏర్పాటు చేసి నగరం నలువైపులా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం కీలకమన్నారు. అన్ని దిక్కుల్లో అన్ని రకాల పనులు సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు. త్వరలో ఈ ప్రాంతాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు సహా విద్య, వైద్యం, విద్యుత్‌శాఖ, మున్సిపల్‌శాఖ, మిషన్ భగీరథ, తదితర మౌలిక వసతుల కల్పనలో భాగస్వామ్యం అయ్యే వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు.

కరోనా కట్టడికి పలు దేశాల్లో మళ్లీ ఆంక్షలు

విదేశీ ప్రయాణికులను నిషేధించిన కువైట్
ఫ్రాన్స్‌లో మళ్లీ లాక్‌డౌన్ నిర్ణయం అమలు

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా కట్టడికి అనేక దేశాలు మళ్లీ ఉపక్రమించాయి. అంతర్జాతీయ రాకపోకలపై కట్టడి చేస్తున్నాయి. లాక్‌డౌన్లు విధిస్తున్నాయి. రెండో దశను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో కరోనా వ్యాప్తిని నిలువరించేందుకు కువైట్ విదేశీయుల రాకపై విధించిన నిషేధాన్ని మరోసారి పొడిగించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వ

శ్రీశైలం నడకదారిలో కర్నాటక భక్తుడి మృతి

కర్నూలు,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం కర్నాటక భక్తుడు పాదయాత్రతో వస్తూ నల్లమల అడవిలో హఠాన్మరణం చెందారు. వేదమూర్తి(43) అనే భక్తుడు నల్లమల అడవి నుంచి కాలినడకన పాదయాత్రగా కుటుంబ సభ్యులతో కలసి శ్రీశైలం వస్తూ మార్గ మధ్యలో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని పోలీసులు, వైద్య సిబ్బంది కలిసి ఆక్సీజన్‌తో స్ట్రెచర్‌పై బీమునికొలను అడవి నుంచి మెట్ల మార్గంలో కైలాస ద్వారం వరకు మోసుకు వచ్చారు. అయితే మృత్యువుతో పోరాడిన వేదమూర్తి చివరకు కన్నుమూశాడు. మృతుడు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు వాసి. భక్తుడి మృతిపై ఈఓ కేఎస్ రామారావు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కనకదుర్గ వారధిపై చైన్‌స్నాచింగ్

విజయవాడ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తాడేపల్లి కనకదుర్గ వారధి వద్ద చైన్ స్నాచింగ్ జరిగింది. దంపతులు బైక్‌పై వెళుతుండగా.. చేజ్ చేసి మహిళ మెడలో నుంచి దుండగుడు చైన్ లాక్కెళ్లాడు. పల్సర్ బైక్‌పై వచ్చిన ఆగంతకుడు దొంగతనానికి పాల్పడ్డాడు. బాధితురాలు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో జడ్పీటీసి ప్రచారం

విజయవాడ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): టీడీపీకి చెందిన కృష్ణా జిల్లా నందిగామ జడ్పీటీసీ అభ్యర్థి సోషల్ మీడియాలో వినూత్న ప్రచారం సాగిస్తున్నారు. నందిగామ టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి సజ్జా అజయ్.. వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నిస్తున్నారు. తాను ఆంధ్ర రాష్ట్రం కోసం, రాజధాని కోసం 14 రోజులు జైలుకు వెళ్లానన్నారు. రైతులు పడుతున్న కష్టాలపై పోరాడితే అక్రమ కేసులు పెట్టారన్నారు. తన అవసరాల కోసం కండువాలు మార్చే వ్యక్తికి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తాను కావాలో, వైసీపీ అభ్యర్థి కావాలో తేల్చుకోవాలన్నారు

రాష్ట్రంలో బిజెపియే ప్రత్యామ్నాయం

-తిరుపతి ప్రచారంలో రఘునందన్ రావు

తిరుపతి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తిరుపతి లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో భాజపా ప్రచారాన్ని వేగవంతం చేసింది. కపిలతీర్థంలో భాజపా-జనసేన సంయుక్తంగా ప్రచారం నిర్వహించాయి. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జనసేన తరఫున పసుపులేటి హరిప్రసాద్ ప్రచారంలో పాల్గొన్నారు. రాజకీయ రణరంగం నుంచి తెదేపా పక్కకు తప్పుకుందని, రాష్ట్రంలో భాజపానే ప్రత్యామ్నాయమని రఘునందన్‌రావు అన్నారు. వైకాపాకు ఓటేస్తే సంఖ్య పెరుగుతుంది తప్ప.. అభివృద్ధి ఉండదని అన్నారు. తిరుపతిలో అన్యమత ప్రచారాలు, అన్యమత ప్రార్థనా మందిరాలు లేకుండా చట్టం తీసుకొస్తామన్నారు. సాంకేతికత ఉన్నా విగ్రహాలు ధ్వంసం చేసే వారిని పట్టుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం పరిపాలన పక్కన పెట్టి మతప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. తిరుపతి లోక్‌సభ స్థానానికి ఈ నెల 17న పోలింగ్ జరగనుంది.కాగా, భాజపా-జనసేన అభ్యర్థిగా రత్నప్రభ, తెదేపా నుంచి పనబాక లక్ష్మి, వైకాపా నుంచి గురుమూర్తి బరిలో ఉన్నారు.

పదవీవిరమణ పొందిన వారికి మళ్లీ ఆహ్వానాలు

-టిటిడి నిర్ణయంతో తిరిగి విధుల్లోకి రమణదీక్షితులు

తిరుమల,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సంచలన నిర్ణయం తీసుకున్నది. పదవీ విరమణ పొందిన అర్చకులను మళ్లీ విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో రిటైర్డ్ అయిన ప్రధాన అర్చకులతోపాటు అర్చకులను విధుల్లో చేరాలంటూ ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు తీర్పు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. దీంతో ప్రధాన అర్చకుడి హోదాలో రమణదీక్షితులు మళ్లీ విధుల్లో చేరనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఆలయ ప్రధాన అర్చకుల విషయంలో సందిగ్ధత నెలకొన్నది.

బార్ అసోసియేషన్ అధ్యక్షుని కి ఘన సన్మానం.



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పిట్టల భూమేష్ ను శనివారం చందుర్తి మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా పిట్టల భూమేష్ మాట్లాడుతూ చందుర్తి మండలం నుండి రాజకీయంగా ఎదిగానని న్యాయవాద వృత్తిలో పనిచేసిన అనుభవంతో తనను బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు, తను ఏ స్థాయికి ఎదిగిన మండల ప్రజలను మర్చిపోనన్నారు, ప్రజాస్వామ్య దేశంలో న్యాయవ్యవస్థ చాలా గొప్పదని, న్యాయ వ్యవస్థను

ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు, గ్రామాల్లో సామాన్య ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తనను సంప్రదించే పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు,అలాగే బార్ అసోసియేషన్ కార్యవర్గంలో పదవులు పొందిన న్యాయవాదులు బొజ్జ మహేందర్, రేగుల రాజకుమార్, బొజ్జ నరేష్ లను కూడా సన్మానించారు, ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పిట్టల బాబు ముదిరాజ్ సంఘం నాయకులు మోతె రాములు, మటకం తిరుపతి, నారాయణ,గామ ప్రభాకర్,గామ రాజు, అర్జున్, సురేష్,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి):భూమి కోసం,భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి అసువులు బాసిన వీరుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, కురుమ జాతి ముద్దుబిడ్డ,తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 94వ జయంతి వేడుకలను శనివారం చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా

సర్పంచ్ మ్యాకల పర్షరాములు ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు,

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మ్యాకల ఎల్లయ్య, కోరే పర్షరాములు, తొంటి బీరయ్య, కోరే మహేశ్, నాగం మల్లేశం, తుప్పతి గణేష్, నాగం స్వామి, నాగం పర్షరాములు, ముద్దల గంగరాజు, నాగం ఐలయ్య, అయోధ్య పర్షరాములు, ఏనుగుల రాజమల్లయ్య, తుప్పతి పర్షరాములు, కొత్తపల్లి దిలీప్, తొంటి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు,

చర్చనీయాంశంగా టిడిపి ఎన్నికల బహిష్కరణ నిర్ణయం

అధికార పార్టీకి దొరికిన తాజా ఆయుధం
టిడిపిపై విమర్శలకు ఇక వైకాపా మరింత పదును

అమరావతి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ అధికారికంగా ప్రకటించడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి సర్పంచ, మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయం పొందింది. వైకాపా గతంలో ఎప్పుడూ లేనంతగా టిడిపిని దెబ్బకొట్టింది. అధికారంలో ఉంటూ ఎలా దెబ్బకొట్టాలో నేర్చుకుంది. దీంతో టిడిపి శ్రేణుల్లో కూడా తీవ్ర నిరాశా నిస్పృహలు ఏర్పడ్డాయి. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని బొమ్మగా చేసి ఎన్నికలను పరిహాసాస్పదంగా మారుస్తున్న జగన్ ప్రభుత్వ వ్యవహార శైలికి నిరసనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. 'నా తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలా ఎన్నికల బహిష్కరణ నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణలో ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలోనూ పోటీ చేశాం. తీవ్రవాదుల ప్రభావం బాగా బలంగా ఉన్న చోట్ల కూడా చేశాం' అని బాబు చెప్పారు. అయితే ఓటమి భయంతోనే బాబు యూ టర్న్ తీసుకున్నారని అధికార పార్టీ ఆరోపిస్తోంది. పోటికి దూరంగా ఉండడం వల్ల పార్టీ శ్రేణులు కూడా మరోదారి వెతుకున్నే ప్రమాదం ఉంది. దీనిని చంద్రబాబు గమనించినట్లు లేదు. ఇలారాజకీయ చరిత్రలో టీడీపీ తొలిసారి ఎన్నికల బహిష్కరణకు నిర్ణయం తీసుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ ఎప్పుడూ ఎన్నికలను బహిష్కరించలేదు. తెలంగాణ ఉద్యమం వంటి సమయాల్లోనూ ఎన్నికల్లో పోటీ చేసింది. మధ్యలో కొన్నిసార్లు కొన్ని ఉప ఎన్నికల్లో మాత్రం పోటీ చేయలేదు. నాటి ప్రధాని పీవీ నరసింహరావు పోటీ చేసిన నంద్యాల లోక్‌సభ స్థానంలో, కాంగ్రెస్ సీనియర్ నేత వీజేఆర్ మరణం తర్వాత జరిగిన ఖైరతాబాద్ ఉప ఎన్నిక, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాగ్యా నాయక్‌ను నక్సలైట్లు హత్య చేసిన తర్వాత వచ్చిన ఉప ఎన్నిక, వైసీపీ నేత శోభా నాగిరెడ్డి మరణం తర్వాత వచ్చిన ఉప ఎన్నికలో మాత్రమే టిడిపి పార్టీ పోటీ చేయలేదు. ఏక మొత్తంగా ఎన్నికలను బహిష్కరించడం ఇదే తొలిసారి. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి తీవ్రమైన వేధింపులు, రాజకీయ దాడులు చవి చూసిన తర్వాత ఈ ఎన్నికలపై ఆ పార్టీలో ఈ ఆలోచన మొలకెత్తింది. ఓ రకంగా వైకాపాను తట్టుకోవడం కష్టమనే భావన క్షేత్రస్తాయిలో వచ్చిందని అంటున్నారు. ఎన్నికలను బహిష్కరించడంలో పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. విభేదించిన వారిలో అయ్యన్నపాత్రుడు, బుచ్చయ్యచౌదరి, యనమల రామకృష్ణుడు, కూన రవికుమార్ వంటివారు ఉన్నారు. ఎన్ని సమస్యలున్నా ఎన్నికల్లో పోరాడుతూనే ఉండాలని, అప్పుడే కేడర్‌ను నిలబెట్టుకోగలమని అభిప్రాయపడ్డారు. కానీ మెజారిటీ నేతలు బహిష్కరణకు మొగ్గు చూపారని సమాచారం. అయితే ఆర్థికంగా కూడా ఎన్నికలను తట్టుకోవడం కష్టంగా ఉందన్న అభిప్రాయం ఉంది. అలాగే పోలీస్ వ్యవస్థ మొత్తంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉందన్న వాదన కూడా వస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

జానా రాజకీయ జీవితానికి ప్రతిష్టగా సాగర్ ఉప ఎన్నిక

గెలుపే లక్ష్యంగా ప్రచారంలో సాగిపోతున్న సీనియర నేత
అధికార పార్టీకి ప్లస్‌గా మారిన ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు
టిఆర్ఎస్‌పై ప్రజల్లో పెద్దగా కనిపించని వ్యతిరేకత

నాగార్జునసాగర్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో బిజెపి, కాంగ్రెస్‌లలో నైరాశ్యం ఉన్నా.. సాగర్‌లో మేకపోతు గాంభీర్యంతో ముందుకు సాగుతున్నారు. తమదే గెలుపు అంటూ ప్రకటించు కుంటున్నారు. మారిన తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సాగర్‌లో టిఆర్ఎస్ దూకుడుగా పోతోంది. మరోవైపు ఈ ఎన్నికల్లో గెలుపుపై ధీమాతో ఉంది. ప్రజల్లో కూడా టిఆర్ఎస్‌ను వ్యతిరేకించాల్సిన అవసరం కనబడడం లేదు. కానీ బిజెపి ఎంతగా కెసిఆర్‌ను డైరెక్ట్‌గా తిట్టినా..మోడీ ఏం చేశాడన్న ప్రశ్నలకు సమాధానం రావడం లేదు. ఇకపోతే రాజకీయంగా నిలవాటంలే జానారెడ్డికి కూడా ఈ ఉప ఎన్నికలో గెలుపు అనివార్యంగా మారింది. గత ఎన్నికల్లో ఓడిపోవడంతో ఇంటికే పరిమితం అయిన జానా ఇప్పుడు గెలవడం ద్వారా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించాలని చూస్తున్నారు. అందుకే చావోరేవో తేల్చుకోవాల్సిన నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూకుడు మంత్రం పఠిస్తున్నారు. నేరుగా కెసిఆర్‌ను, టిఆర్ఎస్‌ను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. ఇప్పటికే పార్టీ జానారెడ్డి విజయం కోసం నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆ పార్టీ నేతలు కూడా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మిగిలిన నాయకులు నియోజకవర్గం లోనే మకాం వేయనున్నారని, పోలింగ్ ముగిసే వరకు ప్రచారంలో అధికార టీఆర్ఎస్‌కు తీసిపోకుండా ముందుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత నెల 27న హాలియాలో జనగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రచారంలో ఊపు తెచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రచార గడువు ముగిసేలోపు మరోమారు నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తోంది. చివరి వారం రోజుల్లో నియోజకవర్గాన్ని చుట్టుముట్టి పోలింగ్‌కు ఉత్సాహంగా సిద్ధం కావాలని నేతలు భావిస్తున్నారు.

ఇతర పార్టీల కంటే ముందుగానే కాంగ్రెస్ పార్టీ జానారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అంతకు రెండు నెలల ముందు నుంచే జానారెడ్డితోపాటు ఆయన తనయులు రఘువీర్, జైవీర్‌లు నియోజకవర్గంలో రెండు దఫాలుగా పర్యటించారు. స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించడం, వారిని ఎన్నికలకు సిద్ధం చేయడంతోపాటు దూరమైన కొందరు నేతలను కలుపుకుని పోయే ప్రయత్నం చేశారు. హాలియాలో నిర్వహించిన జనగర్జన బహిరంగ సభకు ఆశించిన మేర జనం హాజరు కావడం, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులందరూ సభకు రావడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. జానా, ఆయన తనయులకు ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కూడా తోడు కానుంది. ఇప్పటికే టీపీసీసీ పక్షాన మండలాలవారీ ఇన్‌చార్జీలను నియమించారు. ఉత్తమ్ ఇకనుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ప్రచారానికి హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆదివారం నుంచి ముఖ్యులంతా నియోజకవర్గంలోనే ఉండి టీఆర్ఎస్‌ను తలదన్నేలా ప్రచారం చేయాలని టీపీసీసీ నాయకత్వం నిర్ణయించింది. టీఆర్ఎస్ డబ్బులు వెదజల్లి, మద్యం పారించి గ్రామాల్లో హల్‌చల్ చేయాలని ప్రయత్నిస్తోందని, అయితే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలపించాలని జానారెడ్డి కోరుతున్నారు. తనను గెలిపించి సోనియాకు కానుకగా ఇవ్వాలని ప్రచారం చేస్తున్నారు. అయితే తెలంగాణలో ఇప్పుడు ఎన్నికలను కేవలం డబ్బులతోనే చూస్తున్నారు. సిద్ధాంతాలు, సెంటిమెంట్లకు కాలం చెల్లింది. ఏ పార్టీ ఎన్ని డబ్బులిచ్చిందా , ఎంత మద్యం పోసిందా అన్నది చూస్తున్నారు. అయితే ఇవన్నీ తట్టుకుని గెలుస్తానని జానారెడ్డి విశ్వాసంతో ఉన్నారు. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అంటున్నారు.కాంగ్రెస్ కేడర్ విజయంపట్ల పూర్తిస్థాయి విశ్వాసంతో ప్రచారంలో ముందుకెళుతోందన్నారు. ఈ ఎన్నికల్లో జానా గెలుపే లక్ష్యంగా రాష్ట్ర కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులంతా ఐక్యంగా, ప్రణాళిక ప్రకారం ప్రచారంలో పాల్గొంటారని అంటున్నారు. ప్రచారంలో చివరి వారంరోజులు చాలా కీలకమని, ఆ సమయంలో విస్తృత ప్రచారానికి ఏర్పాట్లు చేసుకోవాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా సీఎం కేసీఆర్ మరోమారు ఇక్కడ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉండటం, ఇప్పటికే టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న నేపథ్యంలో తాము ఎక్కడా తగ్గలేదనే విధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లేలా రూట్‌మ్యాప్ తయారు చేసుకుంటున్నారు. కోవిడ్‌తో ఇంటికే పరిమితమైన మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఈ నెల 5 తర్వాత ప్రచారంలో పాల్గొనే అవకాశముందని తెలుస్తోంది. సీఎం బహిరంగసభ నిర్వహించే తేదీని బట్టి మరోమారు తాము కూడా బహిరంగ సభ నిర్వహించాలని, ఈ సభకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌తోపాటు జానాతో సన్నిహిత సంబంధాలున్న జాతీయ నేతలను కూడా ఆహ్వానించాలని యోచిస్తున్నారు. చివరి వారంపాటు నియోజకవర్గంలోని గడప గడపనూ తొక్కి జానా గెలుపు కోసం ఓటర్లను అభ్యర్థించే వ్యూహంతో టీపీసీసీ సిద్ధమవుతోంది. మొత్తంగా జానాతో పాటు కాంగ్రెస్‌కు కూడా ఈ ఎన్నికలో గెలుపు ముఖ్యంగా మారింది.

రాజధాని తరలింపు ప్రక్రియ వేగవంతం ?

త్వరలోనే అంటూ ఉద్యోగులకు సంకేతాలు
రాజధాని తరలింపుపై సర్వత్రా ఇప్పుడు చర్చ

విశాఖపట్టణం,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): విశాఖకు పరిపాలనా రాజధానిని తరలించేందుకు ఇప్పుడు వైకాపా ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుంటోంది. విశాఖలో తొలుత అడుగు పెట్టాక రానున్న రోజుల్లో మొత్తంగా విశాఖనే రాజధానిగా మారినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. అమరావతిలో భూముల వ్యవహారం,కోర్టు కేసులు తేలకున్నా అడుగు ముందుకు వేయాలన్న పట్టుదలతో సిఎం జగన్ ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ తిరుగులేని విజయం సాధించిన తర్వాత పరిపాలనా రాజధాని తరలింపును ప్రభుత్వం స్పీడప్ చేసినట్టు కనిపిస్తోంది. విజయవాడ, గుంటూరు కార్పొరేషన్ల తోపాటు విశాఖ మున్సిపల్ కార్పొరేషన్లను వైసీపీ గెల్చుకున్న క్రమంలో ప్రభుత్వ పెద్దలు మరోఆలోచన చేయకుండా ముందుకు సాగుతున్నారు. నిన్న మొన్నటి వరకు కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఇప్పట్లో సాధ్యం కాదని అధికారులు భావించారు. కొందరు మంత్రులు సైతం ఆంతరంగిక సంభాషణల్లో ఇంకా ఏడాది పట్టొచ్చని అభిప్రాయపడిన సందర్భాలూ ఉన్నాయి. కానీ.. మంత్రి బొత్స సత్యనారాయణ ఇటీవల చేసిన కామెంట్స్‌తో అందరి అంచనాలు పటాపంచలయ్యాయి. కోర్టులు.. కరోనా.. ఇలా ఏదో ఒక రూపంలో అవాంతరం వస్తోందని అనుకున్నా ఇక మూటాముల్లె సర్దుకోవాల్సిందే అన్న సంకేతాలు వస్తున్నాయి.

కోర్టులను ఒప్పిస్తామని చెబుతూనే.. ఏ క్షణంలోనే సరే విశాఖకు పరిపాలనా రాజధానిని తరలించేందుకు సిద్ధంగా ఉన్నామన్నది మంత్రి బొత్స ప్రకటన. ఇప్పటికిప్పుడు సచివాలయాన్ని విశాఖకు తరలించడం సాధ్యమా అన్నది కొందరి ప్రశ్న. కానీ.. కొన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ముందు జాగ్రత్త పడుతున్నారట. విశాఖలో తమ కార్యాలయాల ఏర్పాటుకు కావాల్సిన భవనాలు, వసతికి సంబంధించి ఇప్పటి నుంచే అన్వేషణ మొదలుపెట్టారని తెలుస్తోంది. విశాఖలో అందుబాటులో ఉన్న భవనాలు, అక్కడి సదుపాయాల గురించి ఆరా తీస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఈ నెలాఖరుకల్లా విషయం తేలనుందని అంటున్నారు.

నిలకడగా రాష్ట్రపతి కోవింద్ ఆరోగ్యం

ఐసియూ నుంచి స్పెషల్ రూమ్‌కు తరలింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఎయిమ్స్‌లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఐసీయూ నుంచి స్పెషల్ రూమ్‌కు తరలించారు. అయన ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతున్నదని ఎయిమ్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రత్యేక వైద్య బృందం రాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నదని చెప్పారు. ఛాతిలో స్వల్పంగా నొప్పి రావడంతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గత నెల 29న ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన వైద్యులు మార్చి 30న బైపాస్ సర్జరీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి బాగానే ఉన్నదని, అయితే కొద్దిరోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు.

మొబైల్ యూజర్లకు బిఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): బీఎస్ఎన్ఎల్ మొబైల్ యూజర్లకు కొత్త ప్లాన్‌ను ప్రకటించింది. రూ.108తో రీచార్జ్ చేసుకున్నవారికి 60 రోజుల పాటు ప్రతి రోజు 1జీబీ డేటాను ఇవ్వనున్నది. ప్రైవేటు కంపెనీల కన్నా మెరుగైన రీతిలో ఇప్పుడు బీఎస్ఎన్ఎల్ తన కస్టమర్లను ఆకట్టుకుంటున్నది. ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్ సంస్థలు తమ ప్లాన్‌లో 1జీబీ డేటాను కేవలం 28 రోజులకు లేదా 56 రోజుల కాలపరిమితితో ఇస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ తన రూ.108 కొత్త ప్లాన్‌లో 1జీబీ డేటాతో పాటు అన్‌లిమిటెడ్ కాలింగ్ ఆఫర్‌ను కూడా ఇచ్చింది. ఒకవేళ డెయిలీ డేటా పూర్తి అయితే, అప్పుడు ఇంటర్నెట్ డౌన్‌లోడింగ్, అప్‌లోడింగ్ స్పీడ్‌ను 80కేబీపీఎస్‌తో ఇవ్వనున్నారు. ఈ కొత్త ప్యాక్ ఢిల్లీ, ముంబై ఎంటీఎన్ఎల్ నెట్వర్క్స్‌లో అందుబాటులోకి వచ్చింది. రూ.47కే ఫస్ట్ రీచార్జ్, రూ.109 ప్లాన్ వోచర్, రూ.998, రూ.1098 లాంటి స్పెషల్ టారిఫ్ వోచర్స్ ను బీఎస్ఎన్ఎల్ రద్దు చేసింది.

సన్యాసం స్వీకరించిన బద్వేల్ మాజీ ఎమ్మెల్యే

-స్వామి శివరామానందంగా మారిన శివరామకృష్ణారావు

కడప,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ఏకంగా ఐదు దశాబ్దాలపాటు రాజకీయాల్లో కొనసాగిన ఓ సీనియర్ నాయకుడు సన్యాసం స్వీకరించాడు. ఈ అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బద్వేలు నియోజకవర్గానికి చెందిన డాక్టర్ శివరామకృష్ణారావు రాజమండ్రి పుష్కరఘాట్ వద్ద శాస్త్రోక్తంగా గురువుల ఆశీస్సులతో సన్యాసం స్వీకరించారు.

దాంతో ఇకపై ఆయన స్వామి శివరామానంద సరస్వతిగా కొనసాగనున్నారు. శివరామకృష్ణారావు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి. దివంగత వైఎన్ రాజశేఖర్‌రెడ్డి సన్నిహితుడిగా ఆయన క్రియాశీల రాజకీయాల్లో కొనసాగారు. తొలిసారి 1972లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 1977లో బద్వేలు నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 1983, 1985 ఎన్నికల్లో ఓడినా, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994, 1999, 2001 ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూశారు.

అయితే, రాష్ట్ర విభజన తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ 2015 నుంచే ఆధ్యాత్మిక చింతనవైపు మొగ్గుచూపి మానస సరోవర్, చార్‌ధామ్, అమర్‌నాథ్‌తోపాటు పలు శక్తి పీఠాలను సందర్శించారు. రిషికేశ్‌కు చెందిన గురువు శ్రీ సద్గురు తత్వవిదానంద సరస్వతి శిష్యరికంలో కొనసాగుతున్నారు. అంతకుముందు శివరామకృష్ణారావు తండ్రి వడ్డెమాను చిదానందం 1952లో తొలి జనరల్ ఎలక్షన్లలో బద్వేలు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

1955లో మైదుకూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన ఆయన 1962లో బద్వేలు నుంచి స్వతంత్య అభ్యర్థిగా పోటీ చేసి మరోమారు శాసనసభ్యునిగా ఎన్నిక కావడం గమనార్హం. బ్రహ్మణ సామాజికవర్గంలో ప్రత్యేక గుర్తింపు పొందిన శివరామకృష్ణారావు ఐదు దశాబ్దాలపాటు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2004లో వైఎన్ ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడంతో జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. 2009లో బద్వేలు నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా మారడంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. రెండోసారి సీఎంగా ఎన్నికైన వైఎస్సార్ ఆయనకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని భావించినా ఆయన అకాల మరణం శివరామకృష్ణారావుకు ఊహించని షాక్. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఏపీ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు.

2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 2015 నుంచి ఆధ్యాత్మిక చింతనవైపు మొగ్గుచూపిన శివరామకృష్ణారావు మానస సరోవర్, చార్‌దాం, అమర్‌నాథ్‌తో పాటు శక్తి పీఠాలను సందర్శించారు. రిషికేశ్‌కు చెందిన గురువు శ్రీ సద్గురు తత్వవిదానంద సరస్వతి శిష్యరికంలో కొనసాగుతున్నారు. మూడు నెలలుగా పూర్తి ఆధ్యాత్మిక జీవితంవైపు ఆకర్షితులైన ఆయన ఎట్టకేలకు సన్యాస దీక్ష తీసుకోవాలని ని

వేములవాడలో చిత్ర కళాకారులకు సత్కారం

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్య కళా నికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయం లు శనివారం కీర్తిశేషులు పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నృత్య కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో చిత్ర కళాకారులకు ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత లో వేములవాడకు చెందిన చిత్రకారులైన రేగుల నర్సయ్య (వాన శ్రీ ఆర్ట్స్),మిట్ట భిక్షపతి (భిక్షపతి ఆర్ట్స్), జోగిన పల్లి చందు (కీరవాణి ఆర్ట్స్) ఉన్నారు. ఈ సందర్భంగా నృత్యకళానికేతన్ సంస్థ న్యాయసలహాదారు తిరుమల గౌడ్ ,మాట్లాడుతూ సీనియర్ చిత్ర కళాకారులను సన్మానించడం హర్షించదగ్గ ది అని అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్లా పోశెట్టి ,గౌరవ అధ్యక్షులు హనుమాన్లు మాట్లాడుతూ మూడు రంగుల జెండా ను రూపొందించిన ఘనత కీర్తిశేషులు పింగళి వెంకయ్య గారి జీ అన్నారు చిత్రకళను జీవనోపాధిగా మలుచుకుని రంగు రంగుల చిత్రాలను లోకానికి అందించిన వారిని సన్మానించడం సంతోషం అన్నారు .ఈ కార్యక్రమంలో కళానికేతన్ అధ్యక్షులు గంగా శ్రీకాంత్ ,మానువాడ లక్ష్మీనారాయణ , మామిండ్ల సత్తయ్య శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.వ

రాష్ట్రంలో ఆందోళనకరంగా కరోనా వేవ్

మద్యం దుకాణాలు ఎందుకు మూయడం లేదు
సినిమాహాళ్లను కూడా మూస్తేనే కంట్రోల్: జీవన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా మళ్లీ విస్తరిస్తుంటే పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని.. విద్యా సంస్థల బంద్ కాదు.. ముందు మద్యం దుకాణాలు.. సినిమా హాళ్లు వెంటనే బంద్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన కరోనా వైరస్ తీవ్రంగా విస్తరిస్తోందని.. సెకండ్ వేవ్ లో రోజుకు వెయ్యి కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పతాక స్థాయిలో కేసులు నమోదవుతాయని తెలుస్తున్నా.. జనసముహాన్ని నివారించలేకపోతున్నారని చెప్పారు. విద్యాసంస్థలు మూసేశారు.. బాగానే వుంది.. సినిమా హాల్స్, వైన్ షాపులు ఎందుకు మూసివేయడం లేదు..? సినిమా నిర్మాతలకు ఇబ్బంది కలగకుండా సర్కార్ సపోర్ట్ చేస్తున్నట్లుంది.. మద్యం దుకాణాల వద్ద.. విచ్చల విడిగా జనం వుంటున్నారు.. ఆదాయ మార్గాలుగా వున్న మద్యం షాపులపై చర్యలు తీసుకోవడంలేదనిపిస్తుందని జీవన్ రెడ్డి అన్నారు. కరోనా వైరస్ సెకండ్ వేవ్ మహారాష్ట్ర నుండి విస్తరిస్తోంది.. అక్కడ ట్రేసింగ్ టెస్టింగ్ లేదు.. మహారాష్ట్ర నుండి తెలంగాణకు రాకపోకలను నిలిపివేయడం లేదు.. ఆయుష్ మాన్ భారత్.. అమలు అవుతుందా లేదా..? కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చడానికి ఎందుకు వెనుకాడుతున్నారు..? ఆయుష్ మాన్ భారతి, ఆరోగ్య శ్రీ లేక ప్రజలు పరేషాన్ అవుతున్నారు.. ప్రైవేట్ హాస్పిటళ్ల దోపిడీకి రోగులు.. సర్వం కోల్పోతున్నారు.. ఫీజుల నియంత్రణ కూడా ఎక్కడా అమలు కావడం లేదు.. మంత్రి ఈటెల కూడా సరిగ్గా పట్టించుకోవడం లేదు.. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన జరగడం లేదని మంత్రి ఈటెల అన్నాడంటే..రాష్ట్రంలో పాలన ఏవిధంగా వుందో అర్థం చేసుకోవచ్చు..ఉద్యోగాల భర్తీలో సర్కార్ నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోంది..సునీల్ మరణానికి సర్కారే కారణం.. బ్జడెట్ లో వైద్యసేవలకు 4.2 శాతం కేటాయించడం దారుణం.. ఇతర రాష్ట్రాల్లో మనకంటే అదనంగానే కేటాయింపులు వున్నాయి..ఢిల్లీ 12.5, అస్సాం 6 శాతం కేటాయించాయి.. సినిమా హాల్స్ ను తాత్కాలికంగా మూసివేయాలి.. మద్యం షాపులు కూడా మూసివేయాలి.. కరోనా సోకినా రోగులకు ఉచిత వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

బైపాస్ ఖబ్రస్థాన్ ను తెలంగాణలో మోడల్ గా అభివృద్ధి పరుస్తాం

-ఎంఐఎం కార్పొరేటర్లకు మేయర్ సునీల్ రావు హామీ

-ఎంఐఎం నేతల కృషితో నాటి ఎంపీ వినోద్ కుమార్ రూ. 2కోట్ల నిధులు మంజూరు చేయించాం

-వన్ టౌన్ ఎదుట ఈద్గాహ్ కూలినప్పుడు రూ.1.50 లక్షలతో నిర్మాణం చేసిన ఘనత ఎంఐఎంది

-ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి):రామగుండం-హైదరాబాద్ బైపాస్ రోడ్ లో గల (ఖబ్రస్థాన్) ముస్లింల స్మశాన వాటికను తెలంగాణ రాష్ట్రం లోనే మోడల్ ఖబ్రస్థాన్ గా అభివృద్ధి పరుస్తామని, ఇందుకు ఎన్ని నిధులైన వెచ్చించేందుకు నగర పాలక సంస్థ సిద్ధంగా ఉందని మేయర్ సునీల్ రావు ఎంఐఎం కార్పొరేటర్లకు హామీ ఇచ్చారని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి లు తెలిపారు. శనివారం నగరంలోని దారుస్సలాం ఎంఐఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు ఎంఐఎం పార్టీ అంటే గిట్టని వారు, తాము చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బురదజల్లేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అనాలోచిత నిర్ణయాలతో స్వంత డబ్బా కొట్టుకోవడం కోసం తప్పుడు నిర్ణయాలతో ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు, అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, అభివృద్ధి చేసేవారిని బద్నామ్ చేయడమే పనిగా పెట్టుకున్నారని వీరిని ముస్లిం సమాజం నమ్మవద్దని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కరీంనగర్ లో ఫేక్ ఎన్కౌంటర్లో మరణించిన అజీజ్ అనే బాలుడిని బైపాస్ ఖబ్రస్థాన్ లో ఖననం చేశారని, అజీజ్ సమాధి ఇప్పుడు ఎక్కడ ఉందో తెలియకుండా ఉందన్నారు. భారీ వర్షాలతో వరదలు పోటెత్తినప్పుడు అజీజ్ సమాధి కొట్టుకుపోయిందా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాకమానేరు రివర్ ఫ్రంట్ కింద మానేరు వాగులో నీరు నిలిచిఉంటే నీటి ప్రవాహానికి సీసీ పిల్లర్లు లేని ప్రహరీ గోడ కూలదు ఖాయమని, సమాధులు కూడా మొత్తం కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

ఎక్కడో తీసిన అపరిశుభ్రమైన సైడ్ డ్రైనేజీ మట్టిని ఖబ్రస్థాన్ లో భరంతి పోసి ఖబ్రస్థాన్ ను మలినం చేశారని ఈ పాపం ఊరికే పొదన్నారు.. నాటి కరీంనగర్ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో రూ. 2కోట్లను మంజూరు చేయించి, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖబ్రస్థాన్, ఈద్గాహ్ ల ప్రహరీ గోడల నిర్మాణానికి, సాలేహ్ నగర్ ఈద్గాహ్ లో మొరంతో భరంతి పోయించిన ఘనత, వన్ టౌన్ ఎదుట ఉన్న ఈద్గాహ్ భారీ వర్షానికి కూలిపోయినప్పుడు ఎంఐఎం పార్టీ ద్వారా రూ.1.50 లక్షలను స్వంతంగా సమకూర్చుకొని అప్పటికప్పుడు నిలబడి ఈద్గాహ్ ను నిర్మాణం చేయించిన ఘనత ఎంఐఎం ది కాదా అని ప్రశ్నించారు.శాంతి నగర్ ఈద్గాహ్ పేపర్లు దాచిపెట్టి బిజెపి నేతలతో కుమ్మక్కై చేజేతులా పోగొట్టిన చదువు రాని అసమర్థ కాంగ్రెస్ నేత చేతిలో కీలుబొమ్మగా మరి అవగాహన లేకుండా మాట్లాడుతున్నరని విమర్శించారు. 7 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆపార్టీలో మైనార్టీ నాయకులుగా ఉండి ముస్లింల అభ్యున్నతికి, ఖబ్రస్థాన్, ఈద్గాహ్, మస్జిద్ ల అభివృద్ధి కోసం ఏనాడు నోరు మెదపకుండా అభివృద్ధి చేస్తున్న ఎంఐఎం పార్టీపై అవాకులు చెవాకులు పేల్చడమే పనిగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక కాంగ్రెస్ మైనార్టీ నాయకుడి ఉచ్చులో పడి టిఆర్ఎస్ మైనార్టీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తూ ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. టిఆర్ఎస్ మైనార్టీ నేతలు మంత్రి కమలాకర్ ను అడిగి ప్రెస్ మీట్ పెట్టారా అని ప్రశ్నించారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేతల్లా డబ్బా కొట్టుకోవడం, అభివృద్ధి కి అడ్డుపడటం, ఇమేజీ కోసం ప్రాకులాడే తత్వం ఎంఐఎంది కాదని, అన్ని వర్గాల కోసం సేవే పరమావధిగా అభివృద్ధి ఎజెండాగా, అభ్యున్నతే లక్ష్యంగా ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు అను నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని, ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయన్నారు. ఈ ఖబ్రస్థాన్ లో గేట్..అసంపూర్తిగా ఉన్న ర్యాంప్ ను సరిచేయడం, గ్రినరీ చెట్లు నాటడం, పిల్లర్లతో కూడిన బౌండరీ వాల్ నిర్మాణం, 5ఫీట్ల భరంతి మొరంతో నింపడం, రక్షిత త్రాగునీటికై ఫిల్టర్ బెడ్ ఏర్పాటు, హైమాస్ట్ సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్ల నిర్మాణం వంటివి ముందుండి నిలబడి ఎంఐఎం పార్టీ గా పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఇవన్నీ పనులు పూర్తి చేశాక రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ ను నిర్మాణం చేయించేందుకు సిద్ధమన్నారు. మోడల్ ఖబ్రస్థాన్ ప్రణాళికలో కమ్యూనిటీ హాల్ కూడా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, మహమ్మద్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, అజహర్ దబీర్, అజీముల్లాహ్ ఖాన్, ఇబ్రహీం, కాజమ్ అలీఖాన్, అన్నేమల్ల సురేశ్, బెజ్జంకి సుధాకర్, సాజిద్ మాజిద్, సాజిద్, నియాజ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్3 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన పలు కుంటుంబాలను శనివారం టీఆర్ఎస్ జిల్లా నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డిపరామర్శించారు.

ఇటీవలే అనారోగ్యంతో మరణించిన సూర దేవవ్వ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మాజీ సర్పంచ్ జకిలేటి గోపాల్ రావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారిని సైతం కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆరెస్ చందుర్తి మండల నాయకులు మ్యాకల ఎల్లయ్య, సర్పంచ్ మ్యాకల పర్శరాములు, నాయకులు. వరికెల బాపూరావు, గరిడి మహేష్, గొల్లపల్లి పర్శరాములు, నాగం నర్సయ్య, పెంటల బీరయ్య, అయోధ్య పుట్టయ్య, మామిడి శంకర్, వరికెల శ్యాం రావు, గొంటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

దాడుల సంస్కృతి పోవాలి

తన కాన్వాయ్‌పై దాడికి ప్రధానిదే బాధ్యత: టికాయత్

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తన కాన్వాయ్‌పై జరిగిన దాడికి ప్రధానమంత్రి నరేంద్రమోదీదే బాధ్యత అని భారతీయ కిసాన్ యూనియన్ నాయకులు రాకేశ్ టికాయత్ అన్నారు. రాజస్తాన్‌లో తన కాన్వాయ్‌పై కొంత మంది జరిపిన దాడిని ఆయన తీవ్రంగా పరిగణించారు. కేంద్ర ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలని, దాడుల సంస్కృతి దేశంలో ఆగిపోవాలని శనివారం మీడియాతో మాట్లాడుతూ టికాయత్ అన్నారు.

నా కాన్వాయ్‌పై జరిగిన దాడకి కేంద్రమే బాధ్యత వహిస్తుంది. ఇది మరింకెవరి దాడో అని చెప్పలేము. ఎందుకంటే దాడికి పాల్పడ్డది భారతీయ జనతా పార్టీ యువజన విభాగానికి చెందిన వ్యక్తులే. 'రాకేశ్ టికాయత్ గో బ్యాక్' అని వారు నినాదాలు ఇచ్చారు. వాళ్లు నా కాన్వాయ్‌పై రాళ్లు విసిరారు. లాఠీలతో దాడి చేశారు. మాతో వారెందుకు పోట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. మేము రైతులము, రాజకీయ నేతలం కాదు' అని టికాయత్ అన్నారు. శుక్రవారం రాజస్తాన్ పర్యటనలో ఉన్న రాకేష్ టికాయత్ కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఆయన కాన్వాయ్‌లోని ఒక కారు ధ్వంసమైంది. పోలీసులు ఓ విద్యార్థి నేతను అరెస్ట్ చేశారు. అయితే దాడకి పాల్పడ్డ వారు బీజేపీ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ కార్యకర్తలేనని బీకేయూ ఆరోపిస్తోంది. ఇదిలా ఉంటే రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌కు రాకేశ్ టికాయత్ వెళ్లనున్నారు. పశ్చిమ గుజరాత్‌లో రైతులతో నిర్వహించే కొన్ని కార్యక్రమాల్లో టికాయత్ పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ విషయమై టికాయత్ స్పందిస్తూ 'గుజరాత్‌కు రెండు రోజుల పర్యటనకు వెళ్లనున్నాం. మేం వెళ్లబోయే ప్రాంతం సున్నితమైనది తెలుసు. అందుకే మేం ముందస్తు జాగ్రత్తలు తీసుకునే వెళ్తున్నాం. బయటికి వ్యక్తులను అక్కడికి రానివ్వడం లేదు. కానీ మేము రైతులను కలవడానికి వెళ్తున్నాం' అని టికాయత్ అన్నారు.

ఉద్యోగ కల్పనపై దృష్టి సారించాలి

తాను ప్రదానిని అయివుంటే అదే చేసేవాడిని : రాహుల్

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): అభివృద్ధి కేంద్రంగా కాకుండా ఉద్యోగ కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ అన్నారు. తాను ప్రధానినైతే నిరుద్యోగుల ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవాడినని ఆయన అన్నారు. యూఎస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ జనరల్ నికోలస్ బర్న్స్ తో జరిగిన చర్చలో రాహుల్ పైకామెంట్స్ చేశారు. 'నేను ప్రధానినైతే అభివృద్ధి నమూనా స్థానంలో ఉద్యోగ కల్పనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తా. అభివృద్ధి అవసరమే. కాదనను, కానీ ఉత్పాదకత, ఉద్యోగాల సృష్టి, విలువల సమ్మిళితం కూడా చాలా ముఖ్యం. ఈ విషయంలో చైనాను మెచ్చుకోవాలి. ఏ చైనా నేత కూడా నాతో తమ దేశంలో ఉద్యోగ కల్పనలో సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పలేదు' అని రాహుల్ పేర్కొన్నారు.

ఆత్మహత్య పేరుతో ఏప్రిల్ ఫూల్

నిజంగానే చనిపోయిన యువకుడు

తిరువనంతపురం,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు స్నేహితులను ఫూల్ చేయబోయిన ఓ యువకుడు ఉరికి చిక్కుకుని మరణించాడు. కేరళలోని అలప్పుజ జిల్లాలో ఏప్రిల్ 1న ఈ ఘటన జరిగింది. తలూవాడికి సమీపంలోని కిలిరూర్‌లో 17 ఏండ్ల సిద్దార్థ్ అజయ్ తన తల్లిదండ్రులు, సోదరితో కలిసి అ÷-దద ఇంట్లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం తర్వాత తన గదిలోకి వెళ్లాడు. చాలా సేపటి వరకు అతడు గది నుంచి రాకపోవడంతో తల్లి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు ఆ గదిలోని కిటికీ వద్ద అతడి మొబైల్ ఫోన్ లైవ్ స్ట్రీమ్‌లో ఉన్నది. దీంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్నేహితులను ఫూల్ చేయబోయిన సిద్దార్థ్ మెడకు బెడ్‌షీట్ చిక్కుకోవడంతో మరణించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ,పోలీస్ ఒక్కటయ్యారు

అందుకే ఎన్నికలను బహిష్కరించాం: టిడిపి

అమరావతి,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): టిడిపి ఎన్నికలను బహిష్కరించడం చరిత్రలో ఇదే మొదటిసారి అని.. రాష్ట్రంలో భయానక పరిస్థితులున్నాయని మాజీ మంత్రి జవహర్ పేర్కొన్నారు. దొంగ, పోలీసు ఒకటయ్యరన్నారు. ఎస్ఈసీ నీలం సాహ్ని జగన్ బంట్రోతు, రబ్బరు స్టాంపులా పని చేస్తున్నారన్నారు. అందుకే ఎన్నికలను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. టీడీపీ పారిపోయిందని సోము వీర్రాజు అంటున్నాడని.. ఎవరిపై పోరాటం చేయాలో మీకు తెలియదన్నారు. టీడీపీపై కాదని.. వైసీపీ మీద పోరాటం చేయాలన్నారు. నోటాకి వచ్చిన ఓట్లు కూడా మీకు రాలేదన్నారు. టీడీపీని కించపరుస్తూ మాట్లాడితే సహించేది లేదన్నారు. ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలను కళ్లు ఉండి చూడలేని కబోది సోము వీర్రాజు అని జవహర్ విమర్శించారు. ఇదిలావుంటే గతంలో జయలలిత, జ్యోతిబసు వంటి వారు ఎన్నికల్ని బహిష్కరించారని టీడీపీ నేత చినరాజప్ప అన్నారు. వాళ్లు కార్యకర్తల్ని కాపాడుకొని సీఎంలు అయ్యారని ఏ2 విజయసాయిరెడ్డికి తెలుసా? అని ప్రశ్నించారు. మీ ఏ1 కూడా అసెంబ్లీని రెండేళ్లు బహిష్కరించిన విషయం మరిచారా?, విజయసాయికి దొంగ లెక్కలు తప్ప చరిత్ర జ్ఞానం ఎక్కడుంది? అని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజాస్వామ్య విలువలు ఏం తెలుసన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో దొంగ, పోలీసు ఒక్కటయ్యారని విమర్శించారు.

రౌడీషీటర్ అసద్ ఖాన్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

-అసద్ యాసిన్ సహా ఆరుగురి అరెస్ట్

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలో రౌడీషీటర్ అసద్‌ఖాన్ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్లు శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు కేసు వివరాలను ఆయన వెల్లడించారు. అసద్‌పై ఆరుగురు వేట కొడవళ్లతో దాడి చేశారన్నారు. అసద్ అల్లుడు యాసిన్ ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడని చెప్పారు. 2018లో అంజద్‌ఖాన్ హత్య కేసులో అసద్ నిందితుడిగా ఉన్నాడని, తన నాన్నను చంపాడనే ప్రతీకారంతోనే కుమారుడు యాసిన్ ఈ హత్య చేశాడని డీసీపీ తెలిపారు. స్నేహితుల సహకారంతో హత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ' ఈ నెల 1న బైక్‌పై వెళ్తున్న అసద్‌ను నిందితులు ఆటోతో ఢీ కొట్టారు. కిందపడిన అసద్‌పై ముగ్గురు వేటకొడవళ్లతో దాడి చేశారు. హత్య తర్వాత ఆటోలో పారిపోయారు. బైక్ వెనుక కూర్చున్న బాబా అనే వ్యక్తికి గాయాలయ్యాయి.

ఎంజి రామచంద్రన్ సిద్ధాంతాలే ముఖ్యం

అన్నా డిఎంకెకు పట్టం కట్టండి: అమిత్ షా

చెన్నై,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తమిళనాడులో ప్రస్తుతం జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికలు ఎంతో కీలకమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. తమిళనాడులోని తిరునెల్వెలిలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. డీఎంకేను రాజవంశ రాజకీయాలతో పోల్చిన ఆయన ఈ ఎన్నికలే రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ధారించబోతున్నాయని అన్నారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రాంచంద్రన్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఎన్డీయే కూటమికి ప్రజలు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు ఎంతో కీలకం. తమిళనాడు రాజవంశం మార్గంలో నడుస్తుందా లేదంటే మక్కల్ తిలగం ఎంజీ రాంచంద్రన్ దారిలో నడుస్తుందా అని తేల్చేందుకు ఈ ఎన్నికలు చాలా కీలకంగా మారబోతున్నాయం. తమిళనాడు ప్రజలు ఎటువైపు ఉన్నారు? రాజవంశం వైపా లేదంటే ఎంజీ రాంచంద్రం వైపా?' అని ఎన్నికల ప్రచార సభకు విచ్చేసిన ప్రజలను అమిత్ షా ప్రశ్నించారు.

ఏప్రిల్ 6న తమిళనాడు అసెంబ్లీకి పోలింగ్ జరగనుంది. ఫలితాలు మే 2న విడుదల కానున్నాయి.

బంగ్లాదేశ్లో లాక్‌డౌన్

5నుంచి వారం పాటు అమలు

ఢాకా,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 మహమ్మారి విజృంభణను నిరోధించేందుకు దేశవ్యాప్తంగా వారం రోజులపాటు అష్టదిగ్బంధనాన్ని అమలు చేస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఏప్రిల్ 5 నుంచి దేశవ్యాప్తంగా ఉపాధి కల్పన రంగం మినహా మిగిలిన అన్ని రంగాలను మూసివేయాలని నిర్ణయించింది. ఈ వివరాలను అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ, రోడ్డు రవాణా శాఖ మంత్రి ఒబెయిదుల్ కాదర్ తెలిపారని 'ఢాకా ట్రిబ్యూన్' వెల్లడించింది. కాదర్ కూడా తన అధికారిక నివాసంలో మీడియాకు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రభుత్వ పాలన శాఖ మంత్రి ఫర్హాద్ హుస్సేన్ 'ఢాకా ట్రిబ్యూన్'తో మాట్లాడుతూ, అష్ట దిగ్బంధనం సమయంలో అన్ని కార్యాలయాలు, కోర్టులు మూతపడతాయని చెప్పారు. పరిశ్రమలు, మిల్లులు మాత్రమే రొటేషన్ పద్ధతిలో కార్యకలాపాలు నిర్వహిస్తాయని చెప్పారు. అష్ట దిగ్బంధనం సమయంలో పరిశ్రమలను, మిల్లులను ఎందుకు పని చేయనిస్తున్నారని విలేకర్లు అడిగినపుడు ఫర్హాద్ మాట్లాడుతూ, వీటిని మూసేస్తే వర్కర్స్ తాము పని చేసే ప్రదేశాల నుంచి తమ ఇళ్ళకు వెళ్ళిపోవలసి వస్తుందన్నారు. బంగ్లాదేశ్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల్లో కొత్తగా 6,830 కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒకే రోజులో ఇన్ఫెక్షన్ రేటు 23.28 శాతం.

పూర్తి కావస్తోన్న దృశ్యం-2 షూటింగ్

టాలీవుడ్‌లో ఒక సినిమా మొదలైతే ఎప్పుడు పూర్తవుతుందో కొన్నిసార్లు చెప్పడం కష్టమవుతుంది. పూరి జగన్నాధ్ మాదిరిగా వారంలో కథ రాసి.. వారంలో డైలాగ్స్ రాసి..మూడు నెలల్లో షూటింగ్ చేసి...అయిదు నెలల్లో తీసుకు వచ్చే దర్శకులు ఇండస్ట్రీలో చాలా తక్కువమంది ఉన్నారు. ఈ విషయంలో పెద్ద పెద్ద చర్చలు కూడా అనవసరం. పూరికి ఏ హీరోయినా ఒకటే... సినిమాని ఆరు నెలల్లో రిలీజ్ చేయాలి అన్నదే టార్గెట్. అందుకే ఆయనతో చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు అందరూ సినిమా చేసేందుకు రెడీగా ఉంటారు. అయితే ఇప్పుడు విక్టరీ వెంకటేష్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా అంతకంటే స్పీడ్‌గా కంప్లీట్ అవుతుందని తాజా సమాచారం. మలయళంలో సూపర్ హిట్ అయిన దృశ్యం 2లో వెంకటేష్ నటిస్తున్న సంగతి తెలిసిందే.

మీనా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి ఒరిజినల్ వెర్షన్‌కి దర్శకత్వం వహించిన జీతు జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నాడు. సినిమా షూటింగ్ మొదలు పెట్టినప్పుడే 50 రోజుల్లో పూర్తి చేయాలన్న టా÷-గ్గ÷ట్ ఫిక్స్ చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా అందుతున్న సమాచారాన్ని బట్టి మేకర్స్ అనుకున్నట్లుగానే టాకీ పార్ట్ శరవేగంగా పూర్తి చేస్తున్నారట. ఇప్పటికే సగానికి పైగా దృశ్యం 2 టాకీపార్ట్ కంప్లీట్ అయిందట. ఒకవైపు ఎఫ్3 షూటింగ్‌లో పాల్గొంటూనే అదే ఉత్సాహంతో ఈ సినిమాని కంప్లీట్ చేస్తున్నాడట వెంకీ. యంగ్ హీరోలకి పోటీగా ఈ ఏడాదిలో ఖచ్చితంగా మూడు సినిమాలని రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యాడట. ఇప్పటికే తమిళ సూపర్ హిట్ అసురన్ తెలుగు రీమేక్ నారప్ప మే 14న రిలీజ్ కాబోతుండగా వరుణ్ తేజ్‌తో కలిసి నటిస్తున్న ఎఫ్ 3 ఆగస్టు 27న రిలీజ్ చేయబోతున్నట్టు ప్రకటించారు. అయితే ఈ సినిమా కంటే ముందే దృశ్యం 2 రిలీజ్ చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది

పుష్ప స్టిల్స్ 7న విడుదల

టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా మూవీ 'పుష్ప'. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు అల్లు అర్జున్ రగ్డ్ లుక్‌ను మాత్రమే చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాకు సంబంధించి టీజర్‌ను కానీ, ఏదేని గ్లింప్స్‌ను కానీ యూనిట్ ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తుందా? అని ప్రేక్షకాభిమానులు ఎంతో ఆసక్